సాక్షి
విశాఖపట్నం

బుధవారం । 12 । జూలై । 2023



ముగిసిన జిమెక్స్ విన్యాసాలు

బంగాళాఖాతంలో జపాన్, ఇండియా మారీటైం విన్యాసాలు (జిమెక్స్) మంగళవారంతో ముగిశాయి. 8లో



సాయి, కాజల్ విజేతలు

ఏఎంసీ స్పోర్ట్స్ మీట్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో సాయిచరణ్‌తేజ, వుమన్ కాజల్‌సింగ్ విజయం సాధించారు. 8లో



నవ్వించే 'సుందరం మాస్టర్'

'సుందరం మాస్టర్' అందరినీ కడుపుబ్బా నవ్విస్తాడని హీరో సాయిధరమ్ తేజ్ అన్నారు. నగరంలో టీజర్ విడుదల చేశారు. 8లో

న్యూస్‌రీల్

విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు నాక్ ఏ-ప్లస్ గ్రేడ్



విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు నాక్ ఏ-ప్లస్ గ్రేడ్ వచ్చింది. ఈ మేరకు బెంగళూరులోని నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్(నాక్) ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి మాట్లాడుతూ ఆంధ్రా, తెలంగాణలోని మరేతర ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలకు అందని విజయం తాము సాధించామని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతుల కల్పన, విద్యాబోధనలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం అమలు, పరిశోధన, నాయకత్వ లక్షణాలు అలవరచడం, పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యను అందుబాటులోకి తీసుకురావడం వంటి అంశాల్లో విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల దూసుకుపోతోందన్నారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని 2023-2028 వరకు కళాశాలకు నాక్ ఏ-ప్లస్ గ్రేడ్ గుర్తింపు వచ్చిందన్నారు. ఇది సమష్టి విజయమని పేర్కొన్నారు.

పుస్తకాలు, యూనిఫాంల కొనుగోలులో ఒత్తిడి చేయొద్దు

ప్రైవేట్ యాజమాన్యాలకు కలెక్టర్ హెచ్చరిక



మహారాణిపేట: పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలను నచ్చిన వారి వద్ద కొనుగోలు చేసుకునే స్వేచ్ఛ విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఉందని.. ఈ విషయంలో యాజమాన్యాలు ఎటువంటి ఒత్తిడి చేయొద్దని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున హెచ్చరించారు. అధిక ఫీజులు వసూలు చేయరాదని, ఈ నిబంధనలను ఎవరైనా అతిక్రమిస్తే డీఈవో, ప్రాంతీయ ఇంటర్మీడియట్ అధికారికి ఫిర్యాదు చేయవచ్చని ఒక ప్రకటనలో సూచించారు. విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేయవద్దని ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలకు ఇప్పటికే ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఈ ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయంపై తనకు కూడా నేరుగా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

విమానాశ్రయం సలహా కమిటీ సభ్యుడిగా పల్లా



దుర్గారావును సత్కరిస్తున్న ఎంపీ ఎంవీవీ

బీచ్‌రోడ్డు: విశాఖపట్నం విమానాశ్రయం సలహా కమిటీ సభ్యుడిగా పల్లా దుర్గారావు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణను మంగళవారం పల్లా దుర్గారావు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం దుర్గారావును ఎంపీ సత్కరించి మాట్లాడారు. పార్టీ అభివృద్ధి కోసం కష్టపడే వారికి తగిన గుర్తింపు ఉంటుందని, అందుకు పల్లా దుర్గారావు నిదర్శనమని ఎంపీ అన్నారు. తనను ఎయిర్‌పోర్టు సలహా కమిటీ సభ్యుడిగా ఎంపిక చేసేందుకు సహకరించిన పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబుకు దుర్గారావు కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేటర్లు మొల్లి లక్ష్మి అప్పారావు, అప్పారి శ్రీవిద్య గిరిబాబు, గుడ్ల విజయ పాల్గొన్నారు.

14న మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్‌లో ఈనెల 14న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారులు సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్), కె.శాంతి(టెక్నికల్) తెలిపారు. ఎనాలిస్ ల్యాబ్, వసంత్ కెమికల్, ఎక్సెల్ ఇండస్ట్రీస్ టీంలీజ్ యూనియన్ బ్యాంక్, ఎస్‌బీఐ కార్డ్స్, హై-గ్రో కెమికల్స్, ఫార్మాటెక్స్, వరుణ్ మోటర్స్, నైవేద్య రెస్టారెంట్, ది పార్క్ హోటల్ యాక్సిస్ బ్యాంక్ తదితర కంపెనీల్లో 215 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ప్రాసెస్ అసోసియేట్, కాల్ అసిస్టెంట్, ఆపరేటర్, కస్టమర్ రిప్రెసెంటేటివ్ ఎగ్జిక్యూటివ్, కెమిస్ట్, క్యాషియర్, జూనియర్ క్యాడ్ ఇంజనీర్, వెర్‌హౌస్ అసోసియేట్స్, జీఐఎస్ ఇంజనీర్ కేడ్, అకౌంటెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్, కేర్ టేకర్స్, సెక్యూరిటీ గార్డ్స్, బ్రాంచ్ గోడౌన్ ఇన్‌చార్జ్, కంప్యూటర్ అపరేటర్ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఏదైనా డిగ్రీ, పోస్ట్ గ్యాడ్యుయేట్, ఐటీఐ, డిప్లమా, బీటెక్, ఎంబీఏల్లో ఉత్తీర్ణత సాధించి 18-37 సంవత్సరాల వయసు కల్గిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ncs.gov.in వెబ్‌సైట్‌లో పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

చల్లారని ఆగ్రహ జ్వాల

పవన్ వ్యాఖ్యలపై వెల్లువెత్తిన నిరసనలు



మారికవలసలో పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వలంటీర్లు

సాక్షి, విశాఖపట్నం: వలంటీర్లనుద్దేశించి జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఆగ్రహ జ్వాల చల్లారలేదు. విశాఖలో మంగళవారం అనేక చోట్ల వలంటీర్లు నిరసన వ్యక్తం చేశారు. ప్రతి వార్డులోనూ మానవహారాలు, రాస్తారోకోలు, ర్యాలీలు నిర్వహించారు. పవన్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఆయన చిత్రపటాలను చెప్పులతో కొట్టి తమ నిరసనను తెలియజేశారు. ప్లకార్డులను చేతబట్టి పవన్ కల్యాణ్ డౌన్‌డౌన్ అంటూ వీధుల్లోనూ, రోడ్లపైన నినదించారు. ప్రజలకు నిస్వార్థ సేవలందిస్తున్న తమపై అభ్యంతరకరంగా వ్యాఖ్యలు చేయడానికి ఆయనకేం అర్హత ఉందని నిలదీశారు. వలంటీర్ల వ్యవస్థ ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు పరిపాలనను చేరువ చేశారని, దీని ద్వారా ఆయనకు మంచి పేరు వస్తుందన్న దురుద్దేశంతోనే వలంటీర్ల వ్యవస్థపై చంద్రబాబు, రామోజీరావులతో ఇప్పుడు పవన్ కల్యాణ్ కూడా జతకట్టారని నిప్పులు చెరిగారు. పవన్ కల్యాణ్ తన వ్యాఖ్యలపై తక్షణమే క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు.



పవన్‌పై ఎంవీపీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న విశాఖ తూర్పు సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల

గౌరవప్రదమైన సేవలందిస్తున్నాం..



మేం వలంటీర్లుగా ప్రజలకు గౌరవప్రదమైన సేవలందిస్తున్నాం. నిస్వార్థ సేవలతో జనానికి చేరువయ్యాం. వారి సమస్యల పరిష్కారంలో పాలుపంచుకుంటున్నాం. ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరువయ్యేలా చూస్తున్నాం. అందుకే ప్రజలు మమ్మల్ని తమ కుటుంబ సభ్యులుగా చూసుకుంటున్నారు. అలాంటి మమ్మల్ని పవన్ కల్యాణ్ సంఘ విద్రోహ శక్తులుగా పేర్కొనడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనం. వలంటీర్ల వ్యవస్థను దెబ్బతీయడానికే చంద్రబాబు, పవన్, రామోజీలు కుట్ర పన్నుతున్నారు.

– చౌదరి శివాజీ, ఉత్తమ వలంటీరు అవార్డు గ్రహీత, 50వ వార్డు

అభినందించాల్సింది పోయి అభాండాలా?



ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నాం. ఎవరికైనా అందకపోతే లోపాలను సరిచేసి అర్హులకు అందేలా చూస్తున్నాం. కరోనా వంటి కష్టకాలంలో ప్రాణాలకు లెక్క చేయకుండా ఇంటింటికి వెళ్లి సేవలందించాం. ఎందరి ప్రాణాలనో కాపాడగలిగాం. నెలనెలా లబ్ధిదార్ల ఇంటి తలుపు తట్టి పింఛను సొమ్ము వారి చేతిలో పెడుతున్నాం. వారి కళ్లలో ఆనందాన్ని చూసి ఎంతో తృప్తి పొందుతున్నాం. వలంటీర్ల సేవలను అభినందించాల్సింది పోయి మహిళలను కించపరిచేలా నిందారోపణలు చేసిన పవన్ క్షమాపణలు చెప్పాలి.

– గౌతమి, వలంటీర్, అబిద్‌నగర్, అక్కయ్యపాలెం



తాటిచెట్లపాలెం ఆంజనేయ ఆలయం వద్ద నిరసన తెలియజేస్తున్న వలంటీర్లు



నాతయ్యపాలెం జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహిస్తున్న వలంటీర్లు

సంక్షేమ వారధులపై అక్కసు

- నాడు బాబు, నేడు పవన్ అభ్యంతరకర వ్యాఖ్యలు
- ప్రజల్లో పట్టు తప్పుతున్నామన్న భీతి
- జనానికి వీరి సేవలను దూరం చేయాలన్న దుర్బుద్ధి
- నిప్పులు చెరుగుతున్న వలంటీర్లు



రేసపువానిపాలెంలో కదలలేని స్థితిలో ఉన్న వృద్ధురాలికి సపర్యలు చేసి.. అనంతరం పింఛన్ అందజేస్తున్న వలంటీర్

సాక్షి, విశాఖపట్నం: పేదలకు సంక్షేమ పథకాలు అందాలి. నిత్యం వారి బాగోగులు చూడటానికి, వారి అవసరాలు తీర్చడానికి ఓ వ్యవస్థ ఉండాలి. ప్రజల వద్దకు పాలన చేరువ కావాలి. అవినీతికి తావులేని సేవలు అందించాలి. ఇలాంటి ఆలోచనలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మది నుంచి ఆవిర్భవించినదే గ్రామ, వార్డు వలంటీర్ల వ్యవస్థ. మూడేళ్ల నుంచి ఊరూ, వాడా నిస్వార్థ సేవలందిస్తూ జనానికి చేరువై అందరి ఆదరాభిమానాలు చూరగొంటున్న ఈ వలంటీర్లను చూసి చంద్రబాబు, పవన్ కల్యాణ్, రామోజీలకు కన్నుకుట్టినట్టుంది. ప్రజల్లో పట్టుతప్పుతున్నామని భీతిల్లుతున్నారు. అందుకే వీరిపై అదే పనిగా ఆక్రోశిస్తున్నారు. మొన్నటికి మొన్న 'మూటలు మోసే ఉద్యోగం.. ఇంట్లో మగవాళ్లు లేనప్పుడు వలంటీర్లు లోపలికి దూరుతారు' అంటూ చంద్రబాబు అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు 'వలంటీర్లు ఒంటరి మహిళల సమాచారాన్ని సంఘ విద్రోహ శక్తులకు ఇస్తున్నారు' అంటూ వారాహి యాత్రలో పవన్ కల్యాణ్ నిందించారు. వీరిద్దరూ ఇలా వీరిని నోటికొచ్చినట్టూ మాట్లాడుతుంటే.. రామోజీ తన పచ్చ పత్రికలో వలంటీర్ల వ్యవస్థను కించపరుస్తూ తరచూ కథనాలు వండుతున్నారు. తాజాగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ తమపై చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలపై వలంటీర్లు పెద్ద ఎత్తున మండిపడుతున్నారు. రెండు రోజులుగా రాష్ట్రంతో పాటు విశాఖ జిల్లాలోనూ వివిధ రూపాల్లో తమ నిరసనను వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు నిస్వార్థంగా సేవలందిస్తున్న తమ గురించి అభ్యంతరకరంగా మాట్లాడటానికి మీకు ఏమి అర్హత ఉందని నిలదీస్తున్నారు. పవన్ తమకు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వానికి పేరువస్తుందనా..

వలంటీర్లు ప్రజలకు బంధువులయ్యారు. 50 ఇళ్లకో వలంటీరు చొప్పున నియామకంతో వారు నిత్యం వారితో మమేకమవుతున్నారు. వారి బాగోగులు అడిగి తెలుసుకుంటున్నారు. కష్టాల్లో పాలుపంచుకుంటూ వారి కుటుంబ సభ్యుల్లో ఒకరిగా మెలుగుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు, వివిధ రకాల సర్టిఫికెట్ల మంజూరులో సాయపడుతూ, స్థానిక సమస్యల పరిష్కారంలో అధికారులతో సమన్వయం చేయడం, నెలనెలా ఇంటింటికీ వెళ్లి పింఛన్ల పంపిణీ వంటి సేవలతో వీరు ప్రజలకు మరింతగా చేరువయ్యారు. పైగా మునుపటిలా లంచాలివ్వకుండా పనులు జరుగుతున్నాయి. కరోనా మహమ్మారి ఎందరినో కబళించినప్పుడు కూడా వీరు కుటుంబ సభ్యులకంటే మిన్నగా బాధితులకు ప్రాణాలకు తెగించి వైద్య సాయం అందించడంలో విశేష సేవలందించి ఎందరో ప్రాణాలను కాపాడగలిగారు. ఇలాంటి నిస్వార్థ సేవలతో వలంటీర్లు ప్రజల మన్ననలు చూరగొన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా వలంటీర్లు కీలకపాత్ర పోషిస్తూ ప్రజల వద్దకే పాలన చేరువయ్యేలా పాటుపడుతున్నారు. అందుకే వలంటీర్ల వల్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంచిపేరు వస్తుందన్న అక్కసుతోనే చంద్రబాబు, పవన్ కల్యాణ్, రామోజీలు పనిగట్టుకుని వీరిని టార్గెట్ చేస్తున్నారన్న వాదన ప్రజల్లో బలంగా వినిపిస్తోంది.

ప్రాణాలను పణంగా పెట్టి సేవలు



కరోనా సమయంలో మా ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు సేవలను అందించాం. మా ఇళ్లలో చిన్నచిన్న బిడ్డలున్నప్పటికీ బయటకు వచ్చే పనిచేశాం. ఆ సమయంలో పవన్ కల్యాణ్ గాని, ఆ పార్టీకి చెందిన నాయకులుగాని ఎక్కడున్నారో చెప్పండి. ఎటువంటి ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సరికాదు. వలంటీర్లకు భేషరతుగా క్షమాపణ చెప్పాలి.

– హైమావతి, వలంటీర్, ఎల్వీనగర్

బ్యాంకర్లు విరివిగా రుణాలివ్వాలి

కలెక్టర్ మల్లికార్జున



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున, చిత్రంలో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

మహారాణిపేట: ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తున్న వ్యవసాయం, ఎస్‌హెచ్‌జీ, బ్యాంక్ లింకేజ్, పేదలందరికీ ఇళ్లు, ఏపీ టిడ్కో ఇళ్లు, తదితర రంగాలకు లక్ష్యం మేరకు బ్యాంకర్లు రుణాలందించి జిల్లా ఆర్థిక ప్రగతిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశించారు. జిల్లా రుణ ప్రణాళిక నాల్గో త్రైమాసికం అమలు, సాధించిన ప్రగతిపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం బ్యాంకర్లతో సమావేశం జరిగింది. ముందుగా గత త్రైమాసిక సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, సాధించిన ప్రగతిని లీడ్ బ్యాంక్ మేనేజర్ వి.శర్మ కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొత్తం రుణ ప్రణాళికలో మార్చి 2023 నాటికి రూ.70,769 కోట్ల పంపిణీతో 266 శాతం ప్రగతి సాధించినట్టు చెప్పారు. వ్యవసాయ రుణాల నిమిత్తం రూ.3,999 కోట్ల లక్ష్యానికి గానూ రూ.5,554 కోట్లతో 139 శాతం, ప్రాధాన్య రంగాలకు సంబంధించి రూ.13,758 కోట్ల లక్ష్యానికి గానూ రూ.16,629 కోట్ల పంపిణీతో 121 శాతం, అప్రాధాన్య రంగాలకు రూ.12,876 కోట్ల లక్ష్యానికి గానూ రూ.54,140 కోట్ల పంపిణీతో 420 శాతం ప్రగతి సాధించినట్టు చెప్పారు. ఎంఎస్ఎంఈ రంగానికి 7,503 కోట్ల లక్ష్యానికి గానూ రూ.10,072 కోట్లు అందజేసి 134 శాతం ప్రగతి సాధించినట్టు వెల్లడించారు. జిల్లాలో అర్హులైన వారికి ఇళ్లు మంజూరు చేశామని.. వారికి రుణాలు మంజూరు చేసి ఇళ్ల నిర్మాణాలకు సహకరించాలని కోరారు. పరదేశీపాలెం, మధురవాడ ప్రాంతాల్లో ఇన్ఫోసిస్, తదితర ఐటీ పరిశ్రమలు అధికంగా వస్తున్నందున బ్యాంకులు తమ శాఖలను విస్తరించాలన్నారు. డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించాలని సూచించారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ ఏపీ టిడ్కో లబ్ధిదారులకు విరివిగా రుణాలు అందించాలన్నారు. దబ్బంద, సత్యనారాయణపురం లేఅవుట్లలో ఇళ్లను వచ్చే నెలలో ప్రారంభించే అవకాశం ఉందన్నారు. ఇళ్ల రుణాలకు సంబంధించి ఇప్పటివరకు కొన్ని బ్యాంకులు ఒక్క దరఖాస్తు కూడా తీసుకోలేదని కలెక్టర్,కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. ఆర్‌బీఐ క్విజ్ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(చిట్టివలస) విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. ఆర్‌బీఐ ఎల్‌డీవో పూర్ణిమ, నాబార్డు డీడీ ఎం.సుమంత్, ఎస్ఎల్‌బీసీ చీఫ్ మేనేజర్ శ్రీనివాస్, డీఆర్‌డీఏ పీడీ శోభారాణి, జీవీఎంసీ యూసీడీ పీడీ పాపినాయుడు, వ్యవసాయ శాఖ అధికారి అప్పలనాయుడు, పశుసంవర్ధక శాఖ జేడీ రామకృష్ణ, మత్స్యశాఖ జేడీ విజయ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన సచివాలయ అడ్మిన్



లంచం తీసుకుంటుండగా పట్టుబడ్డ అడ్మిన్ భాస్కరరావు(టీషర్ట్)ను విచారిస్తున్న సీఐ

అగనంపూడి: ఇంటి పన్ను వేయడానికి రూ.20వేలు లంచం తీసుకుంటూ 79వ వార్డు ప్రశాంతినగర్ వార్డు సచివాలయ అడ్మిన్ భాస్కరరావు మంగళవారం ఏసీబీ అధికారులకు చిక్కాడు. బాధితుడు మామిడి సోమునాయుడు, ఏసీబీ ఏఎస్పీ శ్రావణి తెలిపిన వివరాలివీ.. పాత అగనంపూడిలో తన తండ్రి పేరుతో ఉన్న ఇంటికి ఇద్దరు కుమారులు పేరుతో ఇంటి పన్ను వేయడానికి పలుమార్లు దరఖాస్తు చేయగా.. వార్డు సచివాలయ అడ్మిన్ డి.భాస్కరరావు తిరస్కరించారు. బాధితుడు సోమునాయుడుతోపాటు మరో ముగ్గురు కలిసి ఈ నెల 4న భాస్కరరావును సంప్రదించగా ఆయన రూ.40 వేలు లంచం డిమాండ్ చేశాడు. వలంటీర్ భర్త శ్రీనివాసరావు మధ్యవర్తిగా రూ.20వేలకు బేరం కుదుర్చుకున్నారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధితుడు ఈ నెల 8న ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేశాడు. ఏసీబీ సూచనల మేరకు బాధితుడు రూ.20 వేలను భాస్కరరావుకు అందిస్తుండగా.. అధికారులు ట్రాప్ చేసి పట్టుకున్నారు. వార్డు సచివాలయ కార్యాలయంలో భాస్కరరావును విచారించారు. ఇంటి పన్ను కోసం ప్రాసెస్ చేసిన దరఖాస్తుల వివరాలు, రికార్డులను పరిశీలించి నిందితుడిని ఏసీబీ కార్యాలయానికి తరలించారు. ఈ దాడిలో ఏసీబీ ఏఎస్పీ శ్రావణి, డీఎస్పీ రమణమూర్తి, సీఐలు కిశోర్‌కుమార్, శ్రీనివాసరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు. కాగా.. భాస్కరరావుపై ఆది నుంచి ఆరోపణలు ఉన్నాయి. వలంటీర్ భర్తను మధ్యలో పెట్టి అవినీతికి పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.

అప్పన్నను దర్శించుకున్న పార్లమెంటరీ కమిటీ



అప్పన్న ఆలయంలో పార్లమెంటరీ కమిటీ సభ్యులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని మంగళవారం అధికార భాషా సంఘం పార్లమెంటరీ కమిటీ దర్శించుకుంది. కమిటీ సభ్యులు శ్రీరామ్ చంద్ర జంగ్రా, ఐరన్న కడకి, సుజిత్‌కుమార్ స్వామిని దర్శించున్న వారిలో ఉన్నారు. వీరికి ఆలయ రాజగోపురం వద్ద అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం కమిటీ సభ్యులు ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదం, స్వామివారి జ్ఞాపికను ఏఈవో భ్రమరాంబ అందజేశారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని, ఆలయ శిల్పసంపద ఎంతో బాగుందని, పూజా విధానం ఆకట్టుకుందని తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం కమిటీ సభ్యులు నేషనల్ హైవే అథారిటీ, హిందూస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, బీఈఎంఎల్ లిమిటెడ్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్, హిందుస్థాన్ షిప్‌యార్డ్, రాష్ట్రీయ ప్రద్యోగికి సంస్థాన్, భారతీయ ప్రబంధన్ సంస్థాన్ అధికారులు, ప్రతినిధులతో ఆయా సంస్థలలో అధికార భాషా అమలు తీరుపై సమీక్షించారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు 20 మంది నామినేషన్

- నేడు నామినేషన్ల పరిశీలన
- ఉపసంహరణకు 15 వరకు గడువు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల నామినేషన్ల గడువు మంగళవారంతో ముగిసింది. మొత్తం 20 మంది కార్పొరేటర్లు నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఇందులో అధికార వైఎస్సార్ సీపీ నుంచి 10 మంది, తెలుగుదేశం నుంచి 10 మంది ఉన్నారు. వైఎస్సార్ సీపీ నుంచి అక్కరమాని పద్మ(1వ వార్డు), గుడ్ల విజయసాయి(23వ వార్డు), ఉరుకూటి నారాయణరావు(29వ వార్డు), కోడిగుడ్ల పూర్ణిమ(41వ వార్డు), కంటిపాము కామేశ్వరి(47వ వార్డు), చల్లా రజని(54వ వార్డు), బల్లా లక్ష్మణరావు(62వ వార్డు), భూపతిరాజు సుజాత(73వ వార్డు), బట్టు సూర్యకుమారి(77వ వార్డు), పీలా లక్ష్మీ సౌజన్య(81వ వార్డు, అనకాపల్లి) నామినేషన్లు దాఖలు చేశారు. తెలుగుదేశం నుంచి గోడి విజయలక్ష్మి బొమ్మిడి రమణ, పిసిని వరహాలక్ష్మీ నరసింహం, శరగడం రాజశేఖర్, గంధం శ్రీనివాసరావు, నొల్లి నూకరత్న, పిల్లా మంగమ్మ, ముక్కా శ్రావణి, మద్దిల రామలక్ష్మి నామినేషన్ వేశారు. అదనపు కమిషనర్ చాంబర్‌లో బుధవారం నామినేషన్ల పరిశీలన ఉంటుందని కమిషనర్ సాయికాంత్ వర్మ వెల్లడించారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 15వ తేదీ వరకు గడువు ఉంది. 19వ తేదీ ఉదయం 10 గంటల నుంచి పోలింగ్, అదే రోజు ఫలితాలు వెల్లడించనున్నట్టు కమిషనర్ పేర్కొన్నారు.

ఏయూ ఇంజినీరింగ్ విద్యార్థులకు సువర్ణావకాశం

- నేవల్ డాక్‌యార్డ్‌లో 6 నెలల పాటు ఇంటర్న్‌షిప్
- ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసిన నేవీ, ఏయూ అధికారులు



ఏయూ వీసీ ప్రసాదరెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న నేవీ, ఏయూ అధికారులు

దొండపర్తి: ఆంధ్రా యూనివర్సిటీ, దాని గుర్తింపు పొందిన ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులకు సువర్ణావకాశం లభించనుంది. నేవల్ డాక్‌యార్డ్‌లో ఆరు నెలల పాటు ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం కలగనుంది. ఇందుకు సంబంధించి ఏయూ వీసీ ప్రొఫెసర్ పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి సమక్షంలో నేవల్ డాక్‌యార్డ్ అడ్మిరల్ సూపరింటెండెంట్, రియర్ అడ్మిరల్ సంజయ్‌సాధు, ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్‌లు మంగళవారం ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. దీని ప్రకారం ఈఈఈ, ఈసీఈ, మెకానికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, మెరైన్ ఇంజినీరింగ్, నేవల్ ఆర్కిటెక్చర్ డిపార్టుమెంట్‌కు సంబంధించిన విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ రక్షణ రంగంతో ఒప్పందం చేసుకోవడం చారిత్రాత్మక విషయమన్నారు. విద్యార్థులు డిఫెన్స్‌లో అధునాతన సాంకేతికతపై 24 వారాల పాటు అధ్యయనం చేసే అవకాశం లభించడం మంచి అవకాశమని పేర్కొన్నారు. ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ దేశ ప్రయోజనాల కోసం భారత సాయుధ దళాలతో ఇప్పటి వరకు 30 ఎంవోయూలపై సంతకాలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో నేవీ నుంచి హెచ్‌ఆర్ జీఎం కమడోర్ అనూప్ మీనన్, హెచ్‌ఆర్ అడిషినల్ జనరల్ మేనేజర్ కమడోర్ ఆర్.వెంకటేశ్వరన్, డిప్యూటీ జీఎం(క్యూఏ) కెప్టెన్ సుబ్రతో మండల్, ఏయూ సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్ అడ్జంక్ట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉజ్వల్ కుమార్ ఘటక్, ఇతర ఏయూ అధికారులు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో అప్రెంటిస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో డిప్లమో, ఇంజినీరింగ్ అప్రెంటిస్‌లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 2021, 2022, 2023 సంవత్సరాల్లో డిప్లమో, బి.ఈ/బి.టెక్ ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. డిప్లమో అప్రెంటిస్ అభ్యర్థులకు రూ. ఎనిమిది వేలు, ఇంజినీరింగ్ అప్రెంటిస్ అభ్యర్థులకు రూ. తొమ్మిది వేల స్టైఫండ్ చెల్లించనున్నారు. ఎంహెచ్‌ఆర్‌డీ నాట్స్‌లో రిజిస్టర్ అయిన అభ్యర్థులను మాత్రమే ఎంపిక చేస్తారు. ఏడాది వ్యవధితో కూడిన ఈ అప్రెంటిస్‌కు సంబంధించిన పూర్తి వివరాలకు https://www.vizagsteel.com ను సందర్శించవచ్చు.

ముగిసిన జిమెక్స్ విన్యాసాలు

దొండపర్తి: జపాన్ ఇండియా మారీటైం విన్యాసాలు(జిమెక్స్) మంగళవారంతో ముగిశాయి. బంగాళాఖాతంలో ఇరుదేశాల నేవీ అధికారులు ఒకరికొకరు వీడ్కోలు పలకడంతో 7వ ఎడిషన్ వ్యాయామాలు పూర్తయ్యాయి. రియల్ అడ్మిరల్ గుర్చరణ్ సింగ్ నేతృత్వంలోని భారత నౌకాదళ నౌకలు కమోర్టా, శక్తి, అలాగే జపాన్ నావికాదళం నుంచి కమాండర్ ఎస్కార్ట్ ఫ్లొటిల్లా నిషియామా తకహీరో నేతృత్వంలో జపాన్ మారీటైమ్ సెల్ఫ్‌డిఫెన్స్ ఫోర్స్ నౌక జేఎస్ సమిదారే నౌకలు ఆరు రోజుల విన్యాసాల్లో పాల్గొన్నాయి. మూడు దశల్లో ఉపరితలం, గాలిలో ఇరుపక్షాలు తమ శక్తి సామర్థ్యాలను ప్రదర్శించాయి.

సాయి, కాజల్ విజేతలు

విశాఖ స్పోర్ట్స్: ఏఎంసీ స్పోర్ట్స్ మీట్‌లో 2019 బ్యాచ్ ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించగా 2020 బ్యాచ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ సాధించింది. అథ్లెటిక్స్ మెన్ ఛాంపియన్‌షిప్‌లో సాయి చరణ్ తేజ, వుమెన్‌లో కాజల్ సింగ్ విజయం సాధించారు. మంగళవారంతో ముగిసిన పోటీల ముగింపు కార్యక్రమానికి సీపీ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ హాజరై.. విజేతలకు ట్రోఫీలు అందించారు. ప్రిన్సిపాల్ బుచ్చిరాజు, శివానంద, మన్మథరావు, రాజేంద్రప్రసాద్, సునీల్ కుమార్ పాల్గొన్నారు.

కడుపుబ్బా నవ్వించే 'సుందరం మాస్టర్'

టీజర్‌ను విడుదల చేసిన హీరో సాయి ధరమ్ తేజ్


సుందరం మాస్టర్ చిత్ర యూనిట్‌తో హీరో సాయి ధరమ్ తేజ్, పలువురు దర్శకులు

బీచ్‌రోడ్డు: 'సుందరం మాస్టర్' అందరినీ కడుపుబ్బా నవ్విస్తాడని హీరో సాయి ధరమ్ తేజ్ అన్నారు. వైవా హర్ష, దివ్య శ్రీపాద జంటగా నటించిన సుందరం మాస్టర్ సినిమా టీజర్‌ను మంగళవారం సిరిపురంలోని వీఎంఆర్డీఏ చిల్డ్రన్ థియేటర్‌లో ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా తేజ్ మాట్లాడుతూ సినిమా టీజర్ చాలా బాగుందని, వైవా హర్ష నవ్వులు పంచుతాడన్నారు. హర్ష తల్లిదండ్రుల ఆనందం కోసమే ఇక్కడికి వచ్చానని, తనకు ఇష్టమైన హీరో రవితేజ నిర్మించిన చిత్రం సుందరం మాస్టర్ అన్నారు. విశాఖ ప్రజల ప్రేమలో కిక్ ఉంటుందని, ఈ సినిమానూ ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. హర్ష మాట్లాడుతూ పదేళ్ల కింద వైవా లఘుచిత్రంలో తన జర్నీ ప్రారంభమైందని.. కలలు కని కష్టపడితే ఎవరైనా వెండితెరపై మెరుస్తారన్నారు. హీరో రవితేజ నిర్మించిన ఈ చిత్రంలో తాను హీరోగా పరిచయం కావడం అదృష్టమన్నారు. తన స్నేహితుడు హీరో సాయి ధరమ్ తేజ్ ఈ సినిమా టీజర్ విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు. దర్శకుడు కల్యాణ్ సంతోష్ మాట్లాడుతూ ఈ సినిమాకు అందరం కలిసి కష్టపడి పనిచేశామన్నారు. దర్శకులు చందూ మొండేటి, సందీప్ రాజ్, సుధీర్ వర్మ, రవికాంత్, హీరోయిన్ దివ్య, సంగీత దర్శకుడు శ్రీ చరణ్ పాకాల, ఆర్ట్ డైరెక్టర్ చంద్రమౌళి, ఆదిత్య, శ్రీకాంత్, శరణ్ తదితరులు పాల్గొన్నారు.

కేకే లైన్‌లో పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం : బొర్రాగుహలు–కరకవలస సెక్షన్ పరిధిలో కొండచరియలు విరిగిపడిన కారణంగా చేపట్టిన పనులు పూర్తయ్యాయి. కాగా.. పునర్నిర్మాణ పనుల కారణంగా కేకే లైన్‌లో ప్రయాణించే పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తెలిపారు. ప్రయాణికులు ఈ మార్పులను గమనించాలన్నారు. విశాఖ–కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ బుధ,గురువారాల్లో, కిరండూల్–విశాఖ (08552) పాసింజర్ స్పెషల్ 13, 14 తేదీల్లో, విశాఖ–కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ 13 వరకు, కిరండూల్ - విశాఖ (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ బుధవారం నుంచి 14వ తేదీ వరకు రద్దు చేశారు.

భారత నౌకాదళంతో గీతం ఎంఓయూ


ఒప్పంద పత్రాలు చూపుతున్న డాక్‌యార్డ్, గీతం అధికారులు

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ ఇవ్వడానికి భారత నౌకాదళం ముందుకొచ్చింది. ఈ మేరకు నేవల్ డాక్‌యార్డ్ సూపరింటెండెంట్ రియర్ అడ్మిరల్ సంజయ్ సాధు, గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ మంగళవారం అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా సంజయ్ సాధు మాట్లాడుతూ స్కిల్ ఇండియాలో భాగంగా భారత నౌకాదళం తన వంతు పాత్రగా యువతకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించిందని చెప్పారు. గీతంతో ఉన్న అనుబంధం దృష్ట్యా ఇంజినీరింగ్ విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంపై ఇంటర్న్‌షిప్‌ల ద్వారా మార్గదర్శకం చేస్తామన్నారు. ప్రో వైస్ చాన్స్‌లర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ ప్రపంచ శ్రేణి విశ్వవిద్యాలయంగా గీతంను ప్రణాళికాయుతంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. గీతం కార్యదర్శి ఎం.భరద్వాజ్, డాక్‌యార్డ్ అధికారులు పాల్గొన్నారు.

పలు రైళ్లు పాక్షిక రద్దు, దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: తిరుపతి స్టేషన్ రీ డెవలప్‌మెంట్ పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే పలు రద్దు చేస్తున్నట్లు, మరికొన్నింటిని గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తెలిపారు.

పాక్షికంగా రద్దు చేసిన రైళ్లు

ఆగస్టు 10 వరకు విశాఖపట్నం–కడప (17488) తిరుమల ఎక్స్‌ప్రెస్ రేణిగుంట–తిరుపతి మధ్య రద్దు చేశారు. ఈ తేదీల్లో ఈ రైలు తిరుపతి వెళ్లకుండా రేణిగుంట మీదుగా కడప చేరుకుంటుంది. కడప– విశాఖ (17487) తిరుమల ఎక్స్‌ప్రెస్ గురువారం నుంచి ఆగస్టు 10 వరకు రేణిగుంట–తిరుపతి మధ్య రద్దు చేశారు. ఈ రైలు తిరుపతి వెళ్లకుండా రేణిగుంట మీదుగా విశాఖ చేరుకుంటుంది. ఈ నెల 15, 22, 29 తేదీల్లో భువనేశ్వర్–తిరుపతి (02809) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రేణిగుంట వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల16, 23, 30, ఆగస్టు 6 తేదీల్లో తిరుపతి– భువనేశ్వర్ (02810) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ తిరుపతి నుంచి కాకుండా రేణిగుంట నుంచి భువనేశ్వర్ బయల్దేరుతుంది. ఈ నెల 15, 22, 29 తేదీల్లో హౌరా–తిరుపతి (20889) ఎక్స్‌ప్రెస్ రేణిగుంట వరకు మాత్రమే నడుస్తుంది. ఈ నెల 16, 23, 30, ఆగస్టు 6 తేదీల్లో తిరుపతి–హౌరా (20890) ఎక్స్‌ప్రెస్ తిరుపతి నుంచి కాకుండా రేణిగుంట నుంచి హౌరా బయల్దేరుతుంది.

దారి మళ్లించిన రైళ్లు...

ఈ దిగువ పేర్కొన్న రైళ్లు రెగ్యులర్ మార్గమైన తిరుపతి, పాకాల, చిత్తూరుల మీదుగా కాకుండా వయా మేల్పాక్కం మీదుగా ఆయా తేదీల్లో రాకపోకలు సాగిస్తాయని రైల్వే అధికారులు తెలిపారు. ఈ నెల 15, 22, 29, ఆగస్టు 5వ తేదీల్లో హతియా -ఎస్ఎంవీ బెంగళూరు (18637) వీక్లీ ఎక్స్‌ప్రెస్ వయా మేల్పాక్కం మీదుగా నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో జూలై 11,18,25 ఆగస్టు ఒకటో తేదీన ఎస్ఎంవీ బెంగళూరు -హతియా(18638) ఎక్స్‌ప్రెస్ వయా మేల్పాక్కం మీదుగా నడుస్తుంది.

పలు రైళ్లు రీషెడ్యూల్

మంగళవారం ఆయా స్టేషన్లలో పలు రైళ్లు ఆలస్యంగా బయలుదేరినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. హౌరా–సికింద్రాబాద్ (12703) ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్, హౌరా– ఎస్ఎంవీ బెంగళూరు (22887) హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్, ఎస్ఎంవీ బెంగళూరు–అగర్తలా (12503)హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్, ఎస్ఎంవీ బెంగళూరు–హౌరా (12864) ఎక్స్‌ప్రెస్, షాలిమార్–చెన్నై సెంట్రల్ (12841) కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ఆలస్యంగా బయల్దేరాయి.

'వీజేఎఫ్'లో అవకతవకలు గుర్తించాం

కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: వైజాగ్ జర్నలిస్ట్ ఫోరం(వీజేఎఫ్) అకౌంట్స్ నిర్వహణలో ఇప్పటివరకు లభించిన ఆధారాల మేరకు సాంకేతికంగా అవకతవకలు జరిగినట్టు గుర్తించామని కలెక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించి నివేదిక అందజేయాలని ఆడిట్ అధికారిని ఆదేశించినట్లు చెప్పారు. ప్రాథమిక ఆడిట్ రిపోర్ట్‌ను బుధవారం విడుదల చేస్తామన్నారు. కలెక్టర్ సమావేశ మందిరంలో మంగళవారం జర్నలిస్టులతో సమావేశమై.. పలు అంశాలను చర్చించారు. పాత కార్యవర్గ సభ్యులకు ప్రస్తుతం అధికారాలు లేనందున.. కొత్త కార్యవర్గం ఏర్పడేంత వరకు ఐదుగురు కమిటీ సభ్యులు వీజేఎఫ్‌కు సంబంధించిన విషయాలను పర్యవేక్షిస్తారన్నారు. వీజేఎఫ్ తాళాలను బుధవారం కమిటీకి అప్పగించాలని ఆదేశించారు. కార్యాలయ సమయంలో వీజేఎఫ్ తెరిచి.. మిగతా సమయంలో మూసివేయాలన్నారు. వీజేఎఫ్ ఎన్నికలకు సంబంధించి కోర్టుకు సమర్పించిన సభ్యుల జాబితాతో పాటు కొత్తగా సభ్యత్వం కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తుది జాబితాను సిద్ధం చేస్తామన్నారు. అర్హులైన అందరికీ ఓటు హక్కు కల్పిస్తామన్నారు. త్వరలోనే వీజేఎఫ్‌కు ఎన్నికలు నిర్వహిస్తామని వెల్లడించారు. జర్నలిస్టులందరూ ఎన్నికలు సజావుగా సాగేందుకు సహకరించాలని కలెక్టర్ కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

సమీక్షలో కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున వైద్యాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మతో కలిసి వైద్యారోగ్య శాఖ అధికారులతో సీజనల్ వ్యాధులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న నాలుగు నెలలు చాలా కీలకమన్నారు. క్షేత్రస్థాయి సిబ్బందితో తరచూ సమావేశాలు, వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించి.. జిల్లాలో డెంగ్యూ, మలేరియా కేసులు నమోదు కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని పక్కాగా చేపట్టాలని.. ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రతీ ఇంటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దోమల నిర్మూలనకు అవసరమైన సిబ్బందిని తాత్కాలిక ప్రాతిపదికన నియమించుకోవాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. డెంగ్యూ నిర్ధారణ పరీక్ష సామర్థ్యం పెంచాలని సూచించారు. ప్రైవేట్ ఆస్పత్రుల నుంచి ప్రతి రోజూ సమాచారం తెప్పించుకుని.. డెంగ్యూ, మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటన చేయాలన్నారు. వర్షపు నీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. కాలువల్లో దోమల నివారణకు స్ప్రేయింగ్ చేపట్టాలని, అంగన్‌వాడీ కేంద్రాలు, హాస్టళ్లలో డెంగ్యూ నివారణ కిట్లను అందుబాటులో ఉంచాలన్నారు. డెంగ్యూ రోగులకు పూర్తిస్థాయి వైద్యం అందించాలని కేజీహెచ్, ఏరియా ఆస్పత్రులు, అగనంపూడి సీహెచ్‌సీ, ఇతర ఆస్పత్రుల వైద్యాధికారులను ఆదేశించారు. ఇల్లు, ఇంటి పరిసర ప్రాంతాలను ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. సమీక్షలో డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్, జిల్లా మలేరియా అధికారి తులసి, జీవీఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ నరేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ మార్కెట్‌లోకి హ్యుందాయ్ ఎక్స్‌టర్


మ్యాంగో హ్యుందాయ్‌లో ఎక్స్‌టర్ కారు ఆవిష్కరణలో పాల్గొన్న వైద్యుడు సుమన్

మధురవాడ: హ్యుందాయ్ మోటార్స్ ఇండియా లిమిటెడ్.. విశాఖ మార్కెట్‌లోకి ఓ సరికొత్త మైక్రో ఎస్‌యూవీ ఎక్స్‌టర్‌ను విడుదల చేసింది. మధురవాడ మ్యాంగో హ్యుందాయ్ షోరూంలో డాక్టర్ సుమన్ గ్రంధి మంగళవారం ఈ కారును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత మాధవ్, సేల్స్ హెడ్ కుమార్‌రాజా మాట్లాడుతూ ఎక్స్‌టర్ కారు ధర రూ.5.99 లక్షల నుంచి రూ.10.9 లక్షల వరకు ఉంటుందని చెప్పారు. బీఎస్–6 నిబంధనలు పాటిస్తూ.. 1.2 లీటర్ ఎన్ఏ ఇంజిన్ అమర్చినట్లు చెప్పారు. పెట్రోల్, సీఎన్‌జీ వేరియంట్లలో లభిస్తుందని, పెట్రోల్ వేరియంట్ లీటరుకు 19.4 కిలో మీటర్లు, సీఎన్‌జీ వేరియంట్ 27.1 కిలో మీటర్ల మైలేజీ ఇస్తుందని వెల్లడించారు. 40కి పైగా అధునాతన భద్రతా ఫీచర్లు, 26 స్టాండర్డ్ సేఫ్టీ ఫీచర్లు ఉన్నాయన్నారు. ఆరు ఎయిర్ బ్యాగ్‌లు, హిల్ అసిస్ట్ కంట్రోల్, రియర్ పార్కింగ్ సెన్సర్, త్రీపాయింట్ సీట్ బెల్ట్, అన్ని సీట్లకూ సీట్‌బెల్ట్ రిమైండర్ అన్ని వేరియంట్లలో లభించనున్నాయని వివరించారు. అలాగే నగరంలోని లక్ష్మీ హ్యుందాయ్ షోరూంలో సీఈవో డాక్టర్ వి.శ్రీనివాస్ ఈ కారును విడుదల చేశారు. విప్లవాత్మక ఉత్పత్తులు, సాంకేతికతతో హ్యుందాయ్ మోటార్ ఇండియా.. ఈ పరిశ్రమలో ఎప్పుడూ కొత్త బెంచ్ మార్క్‌ను సృష్టిస్తుందన్నారు.